విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - భీమిలి: స్థానిక భీమిలి గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు అతిథుల సమక్షంలో విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు డిబేట్ కార్యక్రమాలు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైలపల్లి లక్ష్మణరావు గంటా నూకరాజు, కే సన్యాసి నాయుడు, హెడ్మాస్టర్ ప్రసాద్, విద్యార్థులు మరియు గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులు పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్నారా..?

ముఖ్యమంత్రి చంద్రబాబుని నిలదీసిన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు

విశాలాంధ్ర - విశాఖ: ముఖ్యమంత్రి చంద్రబాబు స్టీల్ ప్లాంట్ కార్మికులపై చేసిన ఆరోపణలు గర్హనీయమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు ఖండించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణల్లో ప్రతి అంశానికీ సమాధానం చెబుతామని అన్నారు. 2009 ఫిబ్రవరి 19న ఢిల్లీలో స్టీల్ ప్లాంట్ కార్మికులు మైన్స్ కోసం ధర్నా చేస్తే దానికి మద్దతుగా మాట్లాడిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేశారని ప్రశ్నించారు? అసెంబ్లీ ఎన్నికల్లో మమ్మల్ని గెలిపించండి. స్టీల్ ప్లాంట్‌ను అన్ని రకాలుగా ఆదుకునే బాధ్యత మాదంటూ చంద్రబాబు చెప్పారని గుర్తు చేశారు. ప్యాకేజీ రూపంలో 11వేల కోట్లు ప్రభుత్వం ఇస్తే స్టీల్ ప్లాంట్ 60 వేల కోట్ల రూపాయలు ఇచ్చిందనే విషయాన్ని చంద్రబాబు ఎందుకు చెప్పడం లేదన్నారు. మైన్స్ ఇప్పించలేకపోయారని విమర్శించారు. మిట్టల్ కోసం మైన్స్ ఇవ్వాలని కేంద్రంతో మాట్లాడిన మీరు, విశాఖ ఉక్కు కోసం ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. గెలిచిన సంవత్సరంలోపే ఇంత దారుణంగా ఎందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. ఉద్యోగులు పనిచేయడం లేదని అంటున్న మీరు స్టీల్ ప్లాంట్ కోక్ ఓవెన్, బ్లాస్ట్ ఫర్నేస్, స్టీల్ మెల్ట్ షాప్ వంటి విభాగాల్లో ఒక్కరోజు నిలబడండి మాట్లాడాలని సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థలు చావడానికి పుట్టాయని పారిశ్రామిక వేత్తల సదస్సులో మోడీ ప్రకటించారని తెలిపారు. మీరు అదే పారిశ్రామిక వేత్తల సదస్సులో విశాఖ ఉక్కు ఉద్యోగులపైన, స్టీల్ ప్లాంట్ పైన దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్టీల్ ప్లాంట్ కార్మికులు పని చేయకుండా జీతాలు తీసుకుంటున్నారని ఆరోపించారని, మీరు మాత్రం అసెంబ్లీకి వెళ్లకుండా జీతభత్యాలను పొందడం సరైనదా అని ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఉత్పత్తితో కూడిన జీతభత్యాలు చెల్లిస్తామని చెప్పడం స్టీల్ ప్లాంట్ మేనేజ్‌మెంట్ వెర్రితనమని విమర్శించారు. అసలు స్టీల్ ప్లాంట్‌కి కావాల్సిన ముడి సరుకులు, యంత్ర సామగ్రి, మానవ వనరులను నాశనం చేస్తూ ఉత్పత్తి ఎలా వస్తుందని స్టీల్ యాజమాన్యం ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ఈ చర్యలన్నీ ప్లాంట్‌ని నష్టాల్లోకి నెట్టి ప్రైవేటుపరం చేయాలనే ఆలోచనలో భాగామేనని విమర్శించారు. స్టీల్ యాజమాన్యం వెంటనే ఉత్పత్తితో కూడిన జీతభత్యాలు చెల్లిస్తామనే సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అన్న క్యాంటీన్లలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో గల అన్నా క్యాంటీన్లలో పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండాలని నిర్వాహకులకు కమిషనర్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం ఆయన కేజీహెచ్ ఒ.పి.గేట్ సమీపంలోనున్న అన్నా క్యాంటీన్ ను జీవీఎంసీ నాలుగవ జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడుతో కలిసి పరిశీలించారు. కమిషనర్ ముందుగా అన్న క్యాంటీన్లో భోజనం టోకెన్లు జారీ చేస్తున్న విధానాన్ని తనిఖీ చేశారు. రోజు ఉదయం, మధ్యాహ్నం భోజనానికి ఎంతమంది అన్న క్యాంటీన్‌కు వస్తున్నారని నిర్వాహకురాలని ఆరా తీయగా, ఉదయం పలహారానికి 650 మంది, మధ్యాహ్నం భోజనానికి 750 మంది వరకు వస్తున్నారని కమిషనర్‌కు నిర్వాహకురాలు వివరించారు. క్యాంటీన్ అంతా పరిశీలించి, క్యాంటీన్లో పరిశుభ్రత సరిగా పాటించడం లేదని ఇకపై నిత్యం పరిసరాల పరిశుభ్రతతోపాటు క్యాంటీన్లో రుచికరమైన వేడి ఆహారాన్ని ప్రజలకు అందించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ వారికి ఆదేశించారు. అనంతరం ఆహారం వడ్డిస్తున్న పరిసరాలను పరిశీలించారు. భోజనం చేస్తున్న వారితో మాట్లాడుతూ ఎక్కడి నుంచి వచ్చారని, ఆహారం వేడిగా రుచిగా ఉందా అని అడగగా., ఆసుపత్రి పని మీద వచ్చామని ఆహారం వేడిగా చాలా బాగుందని కమిషనర్‌కి వారు వివరించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం అన్నా క్యాంటీన్ రోడ్డులో అస్తవ్యస్తంగా ఉన్న పార్కింగ్‌ను కమిషనర్ గమనించి, వాహనాలు రాకపోకలకు, పాదచారుల నడక మార్గానికి ఆటంకం కలుగుతుందని, రోడ్లపై పార్కింగ్ చేయకుండా కేజీహెచ్ ఓపి గేట్ ప్రధాన రోడ్డులో ఉన్న వాణిజ్యసముదాయాలలో గల సెల్లార్ ఫ్లోర్లలో వాహనాలను పార్కింగ్ చేసుకునేలా ఆయా సముదాయాల యజమానులకు ఆదేశించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుసిడి ఏపిడి పద్మావతి, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఔషధరంగంలో నాణ్యతకు ప్రాధాన్యత

గీతం ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్

విశాలాంధ్ర - మధురవాడ: భారతదేశ ఔషధరంగం ప్రపంచంలో తృతీయ స్థానంలో ఉందని ముఖ్యంగా ప్రపంచంలోని వివిధ దేశాలకు 20 శాతం జనరిక్ ఔషధాలు భారతదేశం నుంచే ఎగుమతి అవుతున్నాయని ఈ దృష్ట్యా నాణ్యతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఉందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఔషధరంగంలో నాణ్యతా వారోత్సవాల సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సామాన్యులకు అందుబాటులో ఉండేలా 200 దేశాలకు భారతీయ ఔషధాలు ఎగుమతి అవుతున్నాయని వాటి విలువ 30 బిలియన్ డాలర్లకు చేరుకుందన్నారు. చిన్న పొరపాటు సహితం ఔషధ రంగంలో తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఈ కారణంగా ఔషధాల తయారీలో నిబంధనలను పాటిస్తూ నిరంతరం నాణ్యతపై దృష్టినిలపాలన్నారు. కార్యక్రమంలో వి.ఎస్.ఆర్.ఎ.లైఫ్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ రీసెర్చిడైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ గుప్తా, గీతం ఫార్మస్యూటికల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాగర్ సుమన్ పాండా, డాక్టర్ జి.సౌజన్య పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్‌లో 100 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు

ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని వినియోగదారులకు 100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 31 వేల రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసామని సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఇప్పటివరకు 1,00,026 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన 31,022 రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను గ్రిడ్‌కు అనుసంధానించడం జరిగిందని సీఎండీ తెలిపారు. ఏలూరు జిల్లాలో 4,134 మంది వినియోగదారులకు 13,491 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్లు, కాకినాడ 3,960 మందికి 12,923 కిలోవాట్లు, విశాఖపట్నం 3,715 మందికి 13,131 కిలోవాట్లు, తూర్పుగోదావరి 3,532 మందికి 11,516 కిలోవాట్లు, పశ్చిమగోదావరి 3,382 మందికి 10,945 కిలోవాట్లు, శ్రీకాకుళం 3,366 మందికి 10,326 కిలోవాట్లు, విజయనగరం 3,279 మందికి 10,242 కిలోవాట్లు, అనకాపల్లి 2,841 మందికి 8,712 కిలోవాట్లు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ 1,934 మందికి 6,091 కిలోవాట్లు, పార్వతీపురం మన్యం 864 మందికి 260 కిలోవాట్లు, అల్లూరి సీతారామరాజు 15 మందికి 48 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్లను గ్రిడ్‌కు అనుసంధానించా మని వివరించారు. ఒక్కసారి పెట్టుబడితో 20 ఏళ్ల వరకు ఇంటికి సరిపడా విద్యుత్ వినియోగించడంతో పాటు, మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపించి ఆదాయం పొందే అవకాశాలు ఉండడంపై దీనికి ఆదరణ పెరుగుతోందన్నారు. ఈ పథకాన్ని వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు తమ ఇంటి మిద్దెపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొని విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకొనే అవకాశాన్ని వినియోగించుకోవాలని సీఎండి విజ్ఞప్తి చేసారు. ఈ పథకంలో భాగంగా ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ ను ఏర్పాటు చేసుకోవాలనుకొనే వినియోగదారులు తమ ఇంటి పైకప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలం కలిగి ఉండాలన్నారు. ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొన్నవారికి 30,000 రూపాయలు, 2 కిలోవాట్లకు 60 వేలు, 3 కిలోవాట్లకు గరిష్ఠంగా 78,000 రూపాయల వరకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. 3 కిలోవాట్లు ఏర్పాటు చేసుకొన్న ఇంటికి నెలకు కనీసం 360 నుంచి 450 యూనిట్ల వరకు ఉత్పత్తి అవుతుందని, ఇంటి అవసరాలకు వాడుకోగా మిగిలిన అదనపు విద్యుత్‌ను ఏపీఈపీడీసీఎల్ కు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చన్నారు. వినియోగదారులు పీఎం సూర్య ఘర్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకొని, అందులో ఎంపానల్ అయిన వెండర్స్ నుంచి తమకు నచ్చిన వెండర్ ద్వారా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటుకు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు ఫోన్ చేయవచ్చని సీఎండి పృథ్వీతేజ్ తెలిపారు.

చిన్నారుల అభివృద్ధే సెయింట్ ఆన్స్ ధ్యేయం

విశాలాంధ్ర - మల్కాపురం: మహిళలను, పిల్లలను అభివృద్ధి చేయడమే సెయింట్ ఆన్స్ సంస్థల ధ్యేయమని విశాఖపట్నం ఆర్చ్ బిషప్ డాక్టర్ ఉడుముల బాల అన్నారు. సోమవారం స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల స్వర్ణోత్సవ ప్రారంభ కార్యక్రమంలో గౌరవ అతిథిగా సెయింట్ ఆన్స్ సంస్థల సుపీరియర్ జనరల్ సిస్టర్ పౌలినా ఆగస్టిన్ పాల్గొని మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ సంస్థలలో చదువుకున్న ప్రతి ఒక్కరు మానవతా విలువలతో, క్రమశిక్షణతో, సేవా భావంతో జీవించాలని అన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాల గత 50 సంవత్సరాల లో సాధించిన ప్రగతికి గాను అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం ప్రోవెన్షియల్ సుపీరియర్ సిస్టర్ శాంఢ్రీనా, విశాఖపట్నం ఆర్చి డయాసిస్ ఛాన్సలర్ ఫాదర్ డాక్టర్ జాన్ ప్రకాష్, పారిస్ ప్రీస్ట్ ఫాదర్ జీవన్ బాబు, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సన్యాసమ్మ, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ క్యాస్లిన్ తదితరులు ప్రసంగించారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల రిక్రూట్‌మెంటుపై విచారణ జరపాలి

విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆంధ్రా యునివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల బ్యాక్ డోర్ రిక్రూట్‌మెంటుపై జిల్లా న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో 7 ఏళ్లుగా ఖాళీ ఉన్న ఎస్సీ, ఎస్టీ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని, ఇప్పుడు జరిగిన నియామకాలు వెంటనే రద్దు చేయాలని, సిట్టింగ్ న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని పిజిఆర్ఎస్‌లో కలెక్టరుకు విదసం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో వెంకటరావు మీడియాతో మాట్లాడుతూ యూనివర్సిటీ వందేళ్ల పండగ జరుపుకుంటున్న నేపథ్యంలో ఈ తప్పుడు రిక్రూట్మెంట్‌తో విశ్వవిద్యాలయ ప్రతిష్ట మసకబారిందన్నారు. 2018 నుండి ఖాళీగా ఉన్న పోస్టులకు 2021 నోటిఫికేషన్ ఆధారంగా ఈ నియామకం జరిగినట్టు వెంకటరావు తెలిపారు. ప్రజా ప్రతినిధి సిఫార్సు లేఖలు ఉన్న 28 మాత్రమే సెలెక్ట్ అవడంలో అంతరార్థం ఏమిటని ప్రశ్నించారు. దరఖాస్తుదారుల మెరిట్ లిస్టు ప్రకటించ లేదని, సెలెక్ట్ అయిన పేర్లు వెబ్ సైట్/ ఆన్ లైన్‌లో పెట్టలేదని, ఇవన్నీ అవినీతికి ప్రతిరూపం అని రాజకీయ ప్రమేయంతోనే ఈ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బూల భాస్కర రావు, గుడివాడ ప్రసాద్, డి.నిర్మల, గారా గోపీ, సిహెచ్ దాలయ్య, సింహాచలం, పైడి రాజు తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి :పెందుర్తి మండలం పినగాడి గ్రామంలోని శ్రీశ్రీ ఉమా రామలింగేశ్వర చౌడేశ్వర స్వామిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోమవారం ఉదయం దర్శించు కున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో స్వామి దర్శన భాగ్యం కల్పించి ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పేరు మీద ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ కార్తీక మాస పర్వదినాన బైలాపూడి హరగోపాల్ దంప తులు, బైలపూడి ఉమామహేశ్వ రరావు ఆహ్వానం మేరకు పినగాడి గ్రామంలో స్వామివారిని దర్శించుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బైలపూడి హరగోపాల్ దంపతులు, ఉమామహేశ్వరరావు దంపతులు, పంచకర్ల వెంకటేశ్వర్లు, తవ్వవానిపాలెం సర్పంచ్ బోకర్ స్వామి నాయుడు, ఐయితి సింహాచలం, గొర్లె అప్పారావు, పినగాడి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ మిత్ర మెరైన్ కోల్డ్ స్టోరేజ్ వద్ద విశ్వహిందూ పరిషత్ ఆందోళన

ఆవు మాంసం నిల్వ వ్యాపారంపై నిరసన

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం శొంఠ్యాం రెవిన్యూ పరిధిలోని దిబ్బడిపాలెం గ్రామానికి వెళ్లే మార్గంలో శ్రీ మిత్ర మెరైన్ కోల్డ్ స్టోరేజీ లో ఆవు మాంసం నిల్వ, వ్యాపారం చేయడంపై విశ్వహిందూ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందస్తు సమాచారంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. హైందవ ధార్మిక సంఘాల ప్రతినిధులు అక్కడకి చేరుకొనే సరికే కోల్డ్ స్టోరేజీలో వ్యాపార సంబంధిత వాహనాలు రాకపోకలు సాగించటంతో నిరసనకారులు పోలీస్ వ్యవస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టోరేజీని సీజ్ చేశామని చెప్పి వ్యాపార కార్యకలాపాలు జరగటంపై అనుమానం వ్యక్తం చేశారు. గోమాంసం సీజ్ చేశామని చెప్పి వ్యాపారాలు సాగించటం ఏమిటి?.. అని పోలీస్‌లను ప్రశ్నించారు. చాలా సేపు వాగ్వాదం తరువాత పోలీసులు 5 గురు సభ్యులను లోపలికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వగా సభ్యులు లోపలికి వెళ్లి పరిశీలించారు. అక్కడ నిల్వకు సంబంధించి సీజ్ చేసినట్లు ఆనవాళ్లు లేవని చెప్పుకొచ్చారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ సుమారు 2 నెలలు క్రితం నిల్వ పెట్టి వ్యాపారం చేస్తున్న విషయం బయటకు వచ్చినా ఇంతవరకు సీజ్ చేయకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది అన్నారు. కూటమి ప్రభుత్వంకి చెందిన బాపట్ల టీడీపీ శాసనసభ్యులు నరేంద్ర వర్మ, ముఖ్య అనుచరుడు సుబ్రహ్మణ్యం గుప్తని కాపాడేందుకు ప్రభుత్వం ఇదంతా చేస్తుందని అతన్ని కాపాడే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని ఆరోపించారు. ఈ నెల 3 నుంచి నేటి వరకు తీసుకున్న చర్యలు ఆధారంగా చూస్తే కేసు దర్యాప్తు తీరు బాగాలేదని చెప్పుకొచ్చారు. స్థానిక పోలీసులతో కోల్డ్ స్టోరేజీలో ఎవరు నిల్వ పెట్టారని ఆరా మాత్రమే తీస్తే కేసులో కీలకమైన గోవధ చేసి వ్యాపారం చేస్తున్న ముఠా తప్పించుకునే అవకాశం ఉందన్నారు. స్థానిక పోలీసు యంత్రాంగంతో దర్యాప్తు చేసి కాలయాపన చేస్తే అక్రమార్కులు జాగ్రత్త పడే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర జాతీయ దర్యాప్తు సంస్థలకు అప్పగిస్తే నిజం బయటకు వస్తుందన్నారు. కేసు దర్యాప్తు అధికారి చెప్పిన దాని ప్రకారం దేశం లోని ఓ మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తి ని చాలా ఏళ్ల క్రిందట ఇక్కడికి స్థానికుడిగా గుర్తింపు తెచ్చుకోవటం, ఈ కోల్డ్ స్టోరేజీలో కొన్నేళ్లు మేనేజర్‌గా విధులు నిర్వహించడం, ఇక్కడ నిల్వ పెట్టిన సంస్థకు చెందిన వ్యక్తి విశాఖ సెంటర్ జైల్లో ఉండటాన్ని బట్టి ఎటువంటి వ్యక్తులు గేదె మాంసం పేరిట గో మాంసం వ్యాపారం సాగిస్తున్నారని ఇట్టే అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి గో మాంసంతో జరుగుతున్న వ్యాపారంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ సమరసత అభియాన్ ఉత్తరాంధ్ర ప్రముఖ్ మీసాల రవీంద్ర, విశ్వ హిందూ పరిషత్ ఆంధ్ర ప్రాంత మందిర, అర్చక పురోహిత్ సురక్ష ప్రముఖ్ పూడిపెద్ది శర్మ విశాఖపట్నం ప్రధాన కార్యదర్శి గాదు వెంకటనారాయణ, స్థానిక ప్రతినిధులు తమ్మిన నరసింగరావు, బాలి రవి, దాసు సతీష్, కోరుకొండ మూర్తి,అక్కిరెడ్డి దేవుడు బాబు, లోకేష్, దుక్క అప్పలరాజు తదితరులు ప్రతినిధులు, బీజేపీ నాయకులు చక్రవర్తి, ప్రసాద్ పట్నాయక్, ఆనందపురం, పద్మనాభం మండలం అధ్యక్షులు పి విజయ, నారాయణరావు..వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుడిలోవ పుణ్యక్షేత్రానికి భక్తుల తాకిడి

విశాలాంధ్ర - ఆనందపురం: కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా ఆనందపురం మండలంలోని గుడిలోవ పుణ్యక్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. వేకువ జాము నుండే భక్తులు ఇక్కడికి వచ్చి స్థానికంగా ఉన్న పవిత్ర స్నాన ఘట్టంలో అభ్యంగన స్నానాలు ఆచరించారు. ఆ తరువాత నారాయణేశ్వర స్వామి, రంగనాథ స్వామి ఆలయాల్లో ప్రధాన అర్చకుడు కొత్ర కామేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులు తమ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. దాదాపు 5 వేల మంది భక్తులు ఇక్కడకు వచ్చినట్లు దేవాలయ సిబ్బంది అంచనా వేశారు. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రుద్రరాజు రామకృష్ణం రాజు బంగి ప్రసాదం (గోధుమ రవ్వ ప్రసాదం) వితరణ చేశారు. సుమారు 3500 మంది భక్తులకు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో మజ్జి వెంకట్రావు,కాళ్ళ నగేష్,పాసర్ల ప్రసాద్, శ్రీ రంగనాథ నారాయణేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కోరాడ గిరిరాజు, డైరెక్టర్లు ధనియాల సూర్యారావు, స్వచ్ఛంద సేవకులు మజ్జి అశోక్, కోరాడ జనార్ధన్, కోరాడ చంద్రావు, బోరాడ అప్పలరాజు, ఉప్పాడ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

6వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గరే గురునాథ్‌కు సన్మానం

విశాలాంధ్ర - కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు టీడీపీ అధ్యక్షులుగా గరే గురునాథ్ పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వార్డు అధ్యక్షులుగా యువకుడికి అవకాశం కల్పించడంపై స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు గరే గురునాథ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువ నాయకత్వం ద్వారా వార్డులో ఏ సమస్య ఉన్నా దానిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడం ద్వారా తక్షణమే పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకులైన నాగోతి వెంకట్రావు, పోతిన శ్రీను, పోతిన పెంటయ్య,వాండ్రసి వెంకట అప్పారావు,వాండ్రసి శ్రీను,వాండ్రసి అప్పలరాజుతో పాటు,బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, వార్డు కోశాధికారి కొరగంజి సూరిబాబు,బూత్ ఇన్‌చార్జి కొల్లి బాబ్జి పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ముఖ్యం: అఖిలపక్షం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం చేయడం తగదని ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని తెలుపుతూ ఆదివారం పెదగంట్యాడలోని అయ్యన్నపాలెం కోరాడ హౌసింగ్ బోర్డ్ ప్రాంతాలలో అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు. ఇప్పటికే గంగవరం పోర్టు వలన అనేకమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని దుమ్ము ధూళి కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజలు ఆరోగ్యపరమైన సమస్యలతో సతమతమ వుతున్నారని ఇలాంటి పరిస్థితుల్లో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మించ తలపెట్టడం అత్యంత దారుణమైన హేయమైన చర్యగా అభివర్ణించారు. నలభై సంవత్సరాల క్రితం స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఇల్లు భూములు కోల్పోయి నిర్వాసితులైన మాకు ఇప్పటికి ఉద్యోగాలు ఇవ్వలేదని వాపోయారు. ఈ ప్రాంత ప్రజలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళనకు గురి చేయడం సమంజసం కాదన్నారు. సత్వరమే గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్ విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ పత్రికా సమావేశం నిర్వహించి ఈ ప్రాంతంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని నిర్మించడం లేదని తెలుపుతూ ఒక ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు పులి రమణారెడ్డి, గోందేశీ మహేశ్వర్ రెడ్డి, యేల్లేటి శ్రీనివాసరావు, మొల్లి రమణ, పెంటయ్య రెడ్డి, అప్పల రెడ్డి, కుంచారావు అప్పలనాయుడు, గొందేసి నాగిరెడ్డి, పాల అప్పారావు, రమణ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

CAUTION NOTICE

My client IDFC FIRST Bank Limited, Dwarakanagar Branch, Visakhapatnam is lending takeover loan to DAMODARI ENTERPRISES Rep by Smt Ellapu Damodhari covering title deeds 1. (Adjudicated) Un Registered Possessory Sale Deed dated 14-08-2002, executed by Vooka Suryakantha in favor of Ellapu Satyanarayana 2. Gift Settlement Deed dated 29.03.2012, Document No. 1989/2012 executed by Ellapu Satyanarayana in favor of Ellapu Damodhari covering below stated Schedule Property, as such any person having any objection for said loan transaction, having title/claim covering below schedule property contact the undersigned with relevant documents within Seven days from the date of this publication, failing which, my client will proceed to complete the loan transaction.

SCHEDULE

All that the site measuring 311.11 Sq.Yds or 260.128 sq.mts, D.No.24-100/3,, Asst.No.1086445510, Electrical ServiceNo. 1163272152 002192, A.C.C. Sheet House with a Plinth area of 810 sft., covered by S.y.No.161/3 of Vepagunta Village, within the limits of GVMC, Gopalapatnam SRO Limits, Visakhapatnam District and bounded by: **East** : Gedda, Bridge, **South** : Gedda, **West** : Plot No. 38, 39, 40, **North** : Gosala to Vepagunta Road.

T. SAMSUKUMAR ADVOCATE
Ph.No.9346303860

సాతుపాటి ప్రసన్నశ్రీ రామోజీ ఎక్సలెన్సీ అవార్డు హర్షణీయం

నీరుకొండ వీరన్న చౌదరి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సాతుపాటి ప్రసన్నశ్రీ రామోజీ ఎక్సలెన్సీ అవార్డు పొందడం హర్షణీయమని బీజేపి నాయకులు, సీనియర్ మాజీ సభ్యులు నీరుకొండ వీరన్న చౌదరి అన్నారు. కళలు, సంస్కృతి రంగంలో ఆమె ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డుకు ఎంపిక అయ్యారన్నారు. గిరిజన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దశాబ్దాలుగా ఆమె కృషి చేసారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాల్లోని కొండదొర, కోయ, సవర, సుగాలి వంటి గిరిజన జాతుల జీవనశైలిని సమగ్రంగా అధ్యయనం చేసారని చెప్పారు.

సిఐఐ భాగస్వామ్య సదస్సులో ఆకర్షణీయంగా నిలిచిన విశాఖ

జీవీఎంసీకి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రశంసలు స్ఫూర్తిదాయకం - జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నవంబర్ 14, 15వ తేదీలలో విశాఖ వేదికగా జరిగిన 30వ సిఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం అయిందని, అందుకు విశాఖ నగరాన్ని సుందరీకరించి శాశ్వత పద్ధతిన అభివృద్ధి పరచిన జీవీఎంసీని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రశంసలతో అభినందించారని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో పిజీఆర్ఎస్ కార్యక్రమం ప్రారంభానికి ముందుగా జివిఎంసి అధికారులతో సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన సిఐఐ భాగస్వామ్య సదస్సులో 120 పైగా దేశాల ప్రతినిధులు, అతిథులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారని, విశాఖ నగర అభివృద్ధి, సుందరీకరణను చూసి ముగ్ధులై విశాఖ నగరం ప్రపంచ దేశాలను ఆకర్షిస్తుందని వారు ప్రశంసలు కురిపించారన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు విశాఖ నగరం ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచి సదస్సుకు విజయవంతంచేసిందని నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారన్నారు. జీవీఎంసీ కీర్తికి శ్రమించిన అధికారులకు, జోనల్ కమిషనర్లకు, ఉద్యోగులకు, పారిశుద్ధ్య కార్మికులకు పేరు పేరునా తన ప్రత్యేక అభినందనలను తెలియజేసుకుంటున్నానన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, ఎస్ ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీరు పి వి వి సత్యనారాయణ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఐ ఎస్ ఎ నరేష్ కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ఏ.ప్రభాకర రావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, డిడిహెచ్ ఎం. దామోదరరావు, పర్యవేక్షక ఇంజనీర్లు, డిసిపిలు, ఏసిపిలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 102 వినతులు



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 102 వినతులు వచ్చాయని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని పాత సమావేశ మందిరంలో జీవిఎంసి అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మలతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా 1వ జోన్ కు 06, 2వ జోన్‌కు 17, 3వ జోన్ కు 14, 4వ జోన్ కు 10, 5వ జోన్ కు 13, 6వ జోనుకు 15, 7వ జోనుకు 02, 8వ జోన్ కు 11, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 14 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ %డ% అకౌంట్సు విభాగమునకు 06, రెవెన్యూ విభాగమునకు 11, ప్రజారోగ్య విభాగమునకు 06, పట్టణ ప్రణాళిక విభాగమునకు 53, ఇంజినీరింగు విభాగమునకు 19, మొక్కల విభాగమునకు 01, యుసిడి విభాగమునకు 06 కలిపి మొత్తంగా 102 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.వి.వి సత్యనారాయణ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఐ ఎస్ ఎ నరేష్ కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ఏ. ప్రభాకర రావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, డిసిఆర్ ఎస్ శ్రీనివాసరావు, డిడిహెచ్ ఎం. దామోదరరావు, పర్యవేక్షక ఇంజనీర్లు, డిసిపిలు, ఏసిపిలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తొలి దశలో గుర్తిస్తే "గర్భశయ క్యాన్సర్"ను నిరోధించవచ్చు

-ఆచార్య ఉమామహేశ్వరరావు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తొలి దశలో గుర్తిస్తే "గర్భాశయ క్యాన్సర్ "ను నిరోధించవచ్చు అని లయన్స్ క్యాన్సర్ అండ్ జనరల్ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ, ఆంధ్ర యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వి. ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ గర్భాశయ క్యాన్సర్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆయన గర్భాశయ క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించారు. ప్రారంభ దశలోనే గుర్తించినప్పుడు సమర్థవంతంగా నిరోధించగల మరియు చికిత్స చేయగల కొన్ని క్యాన్సర్లలో గర్భాశయ క్యాన్సర్ ఒకటన్నారు. సాధారణ స్క్రీనింగ్, సకాలంలో హ్యూమన్ పాపిల్లోమావైరస్ (హెచ్‌పివి) టీకాలు వేయడం, సరైన జీవనశైలి ఎంపిక చేయడం వంటి విషయాలు ప్రముఖంగా పనిచేస్తాయన్నారు. స్క్రీనింగ్ సిఫార్సులు, వయస్సు, ప్రమాదాన్ని బట్టి మారుతూ ఉంటాయి. 21-29 సంవత్సరాల వయస్సు గల మహిళలు సాధారణంగా ప్రతి మూడు సంవత్సరాలకు పాప్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. 30-65 సంవత్సరాల వయస్సు గల వారు ప్రతి మూడు సంవత్సరాలకు పాప్ పరీక్ష, ప్రతి ఐదు సంవత్సరాలకు హెచ్ పి వి పరీక్ష లేదా ప్రతి ఐదు సంవత్సరాలకు సహ-పరీక్షను ఎంచుకోవచ్చు. 65 సంవత్సరాల తర్వాత, వైద్యుల సలహా ప్రకారం స్క్రీనింగ్ నిలిపివేయబడవచ్చన్నారు.

గర్భాశయ తొలగింపు గర్భాశయ శస్త్రచికిత్స) చేయించుకున్న, గర్భాశయ క్యాన్సర్ చరిత్ర లేని మహిళలకు సాధారణంగా తదుపరి స్క్రీనింగ్ అవసరం లేదన్నారు. హెచ్ పి వి టీకాలు గర్భాశయ క్యాన్సర్ నివారణలో మార్పు తీసుకొచ్చాయని తెలియజేశారు. టీకా వేయడానికి అనువైన వయస్సు 9 నుండి 26 సంవత్సరాలు, కొన్ని సందర్భాల్లో సంప్రదింపుల తర్వాత 45 వరకు పొడిగించవచ్చున్నారు.

జీరో కమిషన్ మోడల్‌ను ప్రారంభించిన ఫ్లిప్‌కార్ట్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశ స్వదేశీ ఇ-కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్, రూ. 1000/- కంటే తక్కువ ధర ఉన్న ఉత్పత్తులకు జీరో కమిషన్ మోడల్‌ను ప్రవేశపెట్టడంతో దాని సెల్లర్ రేట్ కార్డ్‌కు ఒక ముఖ్యమైన మెరుగుదలను ప్రకటించింది ఫ్లిప్‌కార్ట్ మార్కెట్‌ప్లేస్ హెడ్ సక్షత్ చౌదరి తెలిపారు. ఆన్‌లైన్ అమ్మకాలను మరింత సమ్మిళితంగా , వృద్ధికి దారితీసేలా చేయాలనే దాని నిరంతర నిబద్ధతకు అనుగుణంగా, ఈ మోడల్ వ్యయ నిర్మాణాలను సులభతరం చేస్తుంది, సరసమైన ధరలను ప్రోత్సహిస్తుంది మరియు దేశవ్యాప్తంగా చిన్న మరియు మధ్యతరహా వ్యాపారాలకు ఫ్లిప్‌కార్ట్ విలువ ప్రతిపాదనను మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. రేటు కార్డులో ఈ పురోగతి అభివృద్ధి ఫ్లిప్‌కార్ట్ యొక్క హైపర్‌వాల్యూ ప్లాట్‌ఫామ్ అయిన షాప్సీని శక్తివంతంగా ప్రభావితం చేసిందన్నారు. జీరో కమిషన్ మోడల్ ఇప్పుడు షాప్సీలోని అన్ని ఉత్పత్తులకు విస్తరించబడింది, ధరతో సంబంధం లేకుండా, హైపర్‌వాల్యూ విభాగాన్ని లక్ష్యంగా చేసుకుని విక్రేతలకు కీలకమైన సహాయకుడిగా దాని స్థానాన్ని మరింత పటిష్టం చేస్తుంది మరియు కస్టమర్లకు స్థోమతను పెంచుతుంది. జీరో కమిషన్ మోడల్, మరింతగా ప్రాంతీయ మరియు ఉద్భవిస్తున్న ఎంఎస్ఎంఇ బ్రాండ్లు నమ్మకంగా డిజిటల్ అధిక వృద్ధిలో చేరడానికి వీలు కల్పించడానికి రూపొందించబడిందన్నారు. భారతదేశం వ్యాప్తంగా మిలియన్ల మంది కస్టమర్లకు ఎక్కువ విలువ మరియు ఎంపికను అందించడానికి వారికి సాధికారత ఇస్తుందని, ఈ నవీకరించబడిన నిర్మాణం కింద, రూ. 1000/- కంటే తక్కువ ధర ఉన్న ఉత్పత్తులను జాబితా చేసే అర్హత కలిగిన విక్రేతల నుండి కమిషన్ రుసుము వసూలు చేయబడదన్నారు. ఈ జీరో కమిషన్ మోడల్, ఫ్లిప్‌కార్ట్ యొక్క సమగ్ర విలువ ప్రతిపాదనకు శక్తివంతమైన మెరుగుదల, ప్రయోజనాన్ని మా పర్యావరణ వ్యవస్థ యొక్క సాటిలేని బలంతో మిళితం చేస్తుంది. ఫ్లిప్‌కార్ట్ యొక్క సరఫరా చైన్ బలం అమ్మకందారులకు అసమానమైన అంచనా మరియు విశ్వసనీయతను అందిస్తుందని తెలిపారు.

మోనో మల్టీ ఫంక్షన్ పరికరాలను ఆవిష్కరించిన కానన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: డిజిటల్ ఇమేజింగ్ సొల్యూషన్స్‌లో అగ్రగామి సంస్థ అయిన కానన్ ఇండియా, ఈ రోజు ఇమేజ్ ఫోర్స్ సి 5100 కలర్ సిరీస్ మరియు 6100 మోనో (నలుపు తెలుపు) సిరీస్‌లను ప్రారంభించినట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ సిరీస్ మల్టీ ఫంక్షన్ పరికరాలు (ఎంఎఫ్‌పీ) ఆధునిక కార్యాలయాల యొక్క ఎప్పటికప్పుడు మారుతున్న అవసరాలను తీర్చడానికి ఖచ్చితంగా రూపొందించబడిన ఒక సరికొత్త శ్రేణి. 'మేక్ బిజినెస్ మూవ్' అనే లక్ష్యాన్ని సాధించడానికి ఉద్దేశించిన ఈ తదుపరి తరం ఎం ఎఫ్ డి లు నాలుగు ముఖ్యమైన అంశాలలో మెరుగైన సామర్థ్యంతో వస్తున్నాయి. అవి భద్రత, విశ్వసనీయత, కనెక్టివిటీ మరియు సుస్థిరత. మే యొక్క పని విధానాన్ని సులభతరం చేసే ఇంటెలిజెంట్ ఆటోమేషన్ నుండి, విలువైన డేటాను రక్షించే అత్యాధునిక భద్రతా ఫీచర్ల వరకు, సి5100 కలర్ సిరీస్ మరియు 6100 మోనో సిరీస్‌తో కూడిన ఇమేజ్ ఫోర్స్ సిరీస్, అన్నింటినీ అందిస్తుంది. ఇది వ్యాపారాలు తమ కార్యకలాపాలను మరింత శక్తివంతంగా మరియు సులభంగా సాధించడానికి తోడ్పడే అత్యంత ప్రభావవంతమైన మరియు అవగాహనాత్మక అనుభవాన్ని అందిస్తుందని కానన్ ఇండియా ప్రతినిధి శోభియాకి నోమురా అన్నారు. కానన్ ఇండియాలో తమ నిబద్ధత ఎల్లప్పుడూ వినియోగదారులకు ఉత్పాదకతను పెంచే సాంకేతికలతో పాటు, డేటా భద్రత మరియు సుస్థిరతకు కూడా మద్దతు ఇచ్చేలా శక్తినివ్వడంపైనే ఉంది. ఏఐ డ్రైవెన్ ఇంటెలిజెన్స్‌తో నిండిన ఈ కొత్త ఇమేజ్ ఫోర్స్ సిరీస్ తమ ఈ విజన్‌కు ఒక నిదర్శనం అన్నారు. కానన్ ఇండియా సీనియర్ డైరెక్టర్, ప్రొడక్ట్ %డ% కమ్యూనికేషన్ సి. సుకుమారన్ మాట్లాడుతూ "కొత్త ఇమేజ్ ఫోర్స్ సి5100 మరియు 6100 సిరీస్‌ల ప్రారంభం అనేది, అధిక సామర్థ్యం, విశ్వసనీయత మరియు భద్రతను అందించే డిజిటల్ వర్క్‌ప్లేస్ సొల్యూషన్స్‌ను రూపొందించడంలో కానన్ యొక్క దృఢమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు.

సి.ఓ.పి.డి.కి ఇన్హలేషన్ థెరపీ అవసరం

విశాలాంధ్ర - విశాఖపట్నం: క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మోనరీ డిసీజ్ (సి.ఒ.పి.డి.) అనేది ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితము చేసే ఒక దీర్ఘకాలిక ఊపిరితిత్తుల పరిస్థితి అని పల్మనాలజిస్ట్ డా. ఎ.ప్రేంకుమార్ అన్నారు. దీనిలో గాలి మార్గాలు బ్లాక్ అవ్వటం వాపును (ఇన్ఫ్లమేషన్ అవ్వటాలు) అలాగే దగ్గు మరియు శ్వాస తీసుకోవడము ఇబ్బందిగా మారడము అనేవి లక్షణాలుగా వుంటాయన్నారు. 2019 గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ స్టడీ ప్రకారము 212 మిలియన్ల ప్రజలను ప్రపంచ వ్యాప్తముగా ప్రభావితము చేస్తోంది, భారతదేశములో 55 మిలియన్ల కేసులు వున్నాయి, ఇక్కడ మరణానికి ఇది రెండవ పెద్ద కారణం అన్నారు. సి.ఒ.పి.డి. మేనేజ్మెంట్ కొరకు ఇన్హలేషన్ థెరపీ అనేది అవసరము అన్నారు. ఈ రోగము యొక్క ప్రతి రోజూ ప్రభావము నుంచి ఉపశమనం కలిగించడము కొరకు పల్మోనరీ రీహాబిలిటేషన్ అనేది చాలా కీలకమైన ఉపయోగించే పద్ధతి అన్నారు. సి.ఒ.పి.డి. వంటి ఊపిరితిత్తుల రోగాలతో బాధపడే ప్రజలకు శ్వాస తీసుకోవడానికి జీవితమును మెరుగుగా జీవించడానికి సహాయము చేయడానికి రూపొందించబడిన ఒక సూపర్‌వైజ్ చేయబడే ప్రోగ్రామ్ పల్మోనరీ రీహాబిలిటేషన్ ఇందులో శిక్షణ పొందిన ఫిజియోథెరపిస్టులు వుంటారన్నారు. రోగుల విజ్ఞానము, వ్యాయామాలు మరియు జీవన సరళి మార్పులను కలపడము ద్వారా, ఊపిరితిత్తుల పనితీరును మరియు మొత్తము మీద జీవితము న్యాణ్యతని మెరుగుపరచడము అనేవి %ఆ=% యొక్క ఉద్దేశము. సాధారణముగా ఈ ప్రోగ్రామ్ 6-8 వారాల వరకు కొనసాగుతుంది, శ్వాస తీసుకోవడములో ఇబ్బందిని తగ్గించడానికి, భౌతిక కార్యకలాపాలను పెంచడానికి మరియు మానసిక శ్రేయస్సుని మెరుగుపరచడానికి ఇది వ్యాయామాలను మరియు శ్వాస తీసుకునే టెక్నిక్‌లను నేర్పిస్తుంది. ఈ మల్టిడిసిప్లినరీ అప్రోచ్ జీవితము నాణ్యతను మెరుగుపరుస్తుంది మరియు హాస్పిటల్ సందర్శనలను మరియు దీర్ఘ-కాలములో ఆరోగ్య సంరక్షణ ఖర్చులను తగ్గిస్తుందన్నారు. వ్యాయామాల శిక్షణ: తట్టుకునే శక్తిని ఇచ్చే వ్యాయామాలు (నడక, సైక్లింగ్), బలము శిక్షణ కండరాల పనితీరుని మరియు బలమును మెరుగుపరచడము ద్వారా రోగులకు శ్వాస తీసుకోవడములోని ఇబ్బందిని మేనేజ్ చేయడానికి మరియు సమయము గడిచేకొద్దీ కార్యకలాపాల స్థాయిలను పెంచడానికి సహాయము చేస్తాయి. సి.ఒ.పి.డి. రోగులలో తక్కువ భౌతిక కార్యకలాపాలు మరియు అధికమైన మరణాల రేటు కారణముగా పల్మోనరీ రీహాబిలిటేషన్ యొక్క ప్రాముఖ్యత సాధారణముగా అండర్‌ప్లే చేయబడుతోంది. ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపరచడమే కాకుండా, %ఆ=% క్రమము తప్పకుండా వ్యాయామాలు చేస్తే వచ్చే లాభాలను కూడా అందిస్తుంది ఇందులో మెరుగైన మానసిక శ్రేయస్సు, మెరుగైన మూడ్ సమతుల్యత, మరియు మెరుగైన కార్డియోవాస్క్యులర్ ఆరోగ్యము వుంటాయి. (సి.ఒ.పి.డి.) చికిత్సా లక్ష్యాలను అందిస్తుంది %-% పెరిగిన వ్యాయామాల తట్టుకునే శక్తి మరియు మెరుగైన జీవితము న్యాణ్యత - ఈ క్రింది వాటి ద్వారా అవి అందుతాయి: శ్వాస తీసుకునే టెక్నిక్‌లు: పర్స్ పెదవులు మరియు డయాఫ్రాగమేటిక్ శ్వాస తీసుకోవడము అనేవి ఊపిరితిత్తుల సామర్థ్యమును పెంచుతాయి మరియు శ్వాస తీసుకోవడములో ఇబ్బందిని రెగ్యులేట్ చేస్తాయి. విజ్ఞానము మరియు కౌన్సెలింగ్: రోగులు (సి.ఒ.పి.డి.) మేనేజ్మెంట్ గురించి తెలుసుకుంటారు, ఇందులో మెడికేషన్ ఉపయోగము, ఆక్సిజన్ థెరపీ మరియు కోపింగ్ స్ట్రాటజీలు వుంటాయి, ఇవి వారికి వారి ఆరోగ్యమును వారి చేతులలో వుంచుకునేలా చేస్తాయి. మానసిక సపోర్ట్: స్ట్రెస్ మేనేజ్మెంట్ మరియు సానుకూల అవుట్‌లుక్ కొరకు వ్యక్తిగత లేదా బృందములో సపోర్ట్ అందిస్తుంది.

గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ట్రింకల్, ఇతర పాఠశాల విద్యార్థులు గ్రంథాలయ అధికారి రమణ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి పెదగంట్యాడ మండలం ఎం.ఈ.ఓ. కె.రమణజీ గ్రంథాలయ ఉద్యమకారులు స్వర్గీయ శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ఉజ్వలన చేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి చదువుకోవాలని పెద్ద స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో నడుపూరు హైస్కూల్ హెచ్.ఎం ఆర్.శ్రీనివాసరావు, వి.ఆర్.లక్ష్మి, జె.శేష కుమారి, గ్రంథాలయ పాఠకులు శేఖర్, మహేష్, నవ్య, జ్యోతి, యుగంధర్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం చిన్నారులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను గ్రంథాలయాధికారి ఎ.అజయ్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రలేఖన పోటీల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి, పరిశీలనాశక్తి పెరుగుతుందని అన్నారు. పోల్గొన్న చిన్నారులను జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అభినందించారు.

ఆనందపురం: గ్రంథాలయ రంగంలో విశేష కృషి చేసిన ప్రముఖులను స్మరించు కార్యక్రమం జాతీయ గ్రంథాలయ వ్యవస్థలో భాగంగా గ్రంథాలయ రంగంలో విశేష కృషి చేసిన ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి, వెంకటరామయ్య సేవలను స్మరించుకుంటూ ఘనంగా సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ రంగానికి వారు చేసిన కృషిని తెలియపరిచారు. గ్రంథాలయంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖనం మ్యూజికల్ చైర్ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల అధికారి బివి ఎస్ అప్పారావు, మాజీ సర్పంచ్ శ్రీనాథ్ నారాయణరావు, ప్రధానోపాధ్యాయులు పైడిరాజు పలువురు పాల్గొన్నారు.

జేవియర్ (ఎక్స్ఏటీ) ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - విశాఖపట్నం: వివిధ మేనేజ్మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి గాను నిర్వహించే భారతదేశంలోని అత్యంత విశ్వసనీయ మేనేజ్మెంట్ ప్రవేశ పరీక్షలలో ఒకటైన జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఎక్స్ఏటీ)- 2026 పరీక్ష కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పరీక్షా నిర్వాహకులు తెలిపారు. 2026 జనవరి 4న ఈ ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. ఈ ఏడాది 2025 డిసెంబర్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. భారతదేశం అంతటా 250 కి పైగా ప్రఖ్యాత సంస్థలలో ఎంబీఏ / పీజీడీఎం కోర్సులను అభ్యసించాలనుకున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎక్స్ఏటీ 2026 రిజిస్ట్రేషన్ ఇప్పటికే ప్రారంభమైందని, దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం కూడా జరిగిందని చెప్పారు. ఆన్‌లైన్ ఫారమ్‌ను పూర్తి చేయడం, అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేయడం, పరీక్ష-నగర ప్రాధాన్యతలను ఖరారు చేయడం మరియు గడువుకు ముందే రుసుము చెల్లించడం చాలా అవసరం అన్నారు. ఎక్స్ఏటీ 2026 కి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన ఏదైనా విశ్వవిద్యాలయం నుండి ఏదైనా విభాగంలో కనీసం మూడు సంవత్సరాల వ్యవధి గల బ్యాచిలర్ డిగ్రీని కలిగి ఉండాలన్నారు. చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ ఎక్స్ఏటీ ఆన్ లైన్ డాట్ ఇన్ xatonline.in%ను సంప్రదించవచ్చని, ఆ వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు.

భారత్‌లో బార్సిలోనా బ్రాండ్ మెల్లర్‌ను ఆవిష్కరించిన లెన్స్‌కార్ట్, పాప్‌మార్ట్‌తో క్రియేటివ్ భాగస్వామ్యం

విశాలాంధ్ర - విశాఖపట్నం: స్పెయిన్‌కి చెందిన మెల్లర్ బ్రాండ్‌ను భారత మార్కెట్లో ఆవిష్కరించినట్లు లెన్స్‌కార్ట్ వెల్లడించింది. అలాగే గ్లోబల్ పాప్-కల్చర్ బ్రాండ్ పాప్‌మార్ట్‌తో ఐవేర్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఆధునిక హౌస్ ఆఫ్ ఐవేర్ బ్రాండ్స్‌ను నిర్మించేందుకు, సమకాలీన ఐవేర్ డిజైన్‌ని లెన్స్‌కార్ట్ కేంద్రంగా నిలబెట్టేందుకు ఇవి ఉపయోగపడనున్నట్లు సంస్థ వివరించింది. పాప్‌మార్ట్ క్రాస్ లెన్స్‌కార్ట్ ఐవేర్ కలెక్షన్ డిసెంబర్ తొలి వారం నుంచి సింగపూర్‌లో ఆన్‌లైన్‌లోను, నిర్దిష్ట లెన్స్‌కార్ట్ స్టోర్స్‌లోనూ లభిస్తుంది. దేశీయంగా తమ రిటైల్ నెట్‌వర్క్‌తో పాటు లెన్స్‌కార్ట్ యాప్, వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా మెల్లర్ బ్రాండ్ ఉత్పత్తులు లభిస్తాయని సంస్థ తెలిపింది. జియోజిఫ్యా ఇంటెలిజెన్స్‌ని ఉపయోగించి ఎంపిక చేసిన సుమారు 500 స్టోర్స్‌లో ఇవి ముందుగా లభిస్తాయని వివరించింది. బార్సిలోనాలో ప్రారంభమైన మెల్లర్, యూరప్‌లో అత్యంత వేగంగా వృద్ధి చెందిన డీటీసీ యూత్ ఐవేర్ బ్రాండ్‌గా ఎదిగింది. 7,00,000కు పైగా ఫాలోయర్లు ఉన్నారు మెల్లర్ యొక్క అద్భుతమైన కమ్యూనిటీ మా హౌస్ ఆఫ్ బ్రాండ్స్‌కి ఒక చక్కని జోడింపు కాగలదు. పాప్ మార్ట్‌తో క్రియేటివ్ భాగస్వామ్యం ద్వారా ఐవేర్‌లోనూ మా కస్టమర్లకు ఆస్వాదించదగ్గ కలెక్షన్‌లను, సృజనాత్మక క్షణాలను అందుబాటులోకి తేగలమని ఆశిస్తున్నాం" అని లెన్స్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో పీయూష్ బన్సల్ తెలిపారు.

అమ్మభాషకు ధూమం..అన్యభాషకు ధూపం..!

- తెలుగుదండు అధ్యక్షులు పరవస్తు సూరి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తెలుగు భాష రక్షణ కోసం తెలుగుదండు సంకల్పించిన "టిట్టిభ సత్యాగ్రహం" సోమవారం 8వ రోజుకు చేరుకుంది. "తెలుగుభాష మా హక్కు" అంటూ కవులు, కళాకారులు పాలకుల మొండి వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలుగుదండు అధ్యక్షులు పరవస్తు ఫణిశయన సూరి మాట్లాడుతూ "అమ్మభాషకు ధూమం, అన్యభాషకు ధూపం" ఇదెక్కడి న్యాయం? అంటూ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజల అజ్ఞానమే మన దేశవాళీ పాలకుల పెట్టుబడి. అందుకే మన బిడ్డలకు విజ్ఞానం మాత్రమే అందించి, జ్ఞానం అందకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలోనే ఉండాలని. విద్యాకమిషన్లు, ఆధునిక విద్యాబోధనా శాస్త్రం చెబుతున్నా, సాంప్రదీకులైన మన పాలకులు ఖాతరు చేయడం లేదని ధ్వజమెత్తారు. చట్టాన్ని అమలు చేస్తే వీళ్ళ ఆటలు సాగవు అని పాలకులను నిందచేశారు. కార్యక్రమంలో తిరుపతి రాజమన్నార్, ఆచార్య సూరప్పడు, విశాఖరత్న పి.పి.భాస్కర్, శివజ్యోతి, మల్లిక, సంధ్యా ప్రియదర్శిని, ఈశ్వరరావు, అల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మేయర్ పీలాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు 57వ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాడుగుల నియోజకవర్గం శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పిజివిఆర్ నాయుడు

(గణబాబు), పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, పలువురు కార్పొరేటర్లు, జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు, ప్రముఖులు పెందుర్తిలో గల తన క్యాంప్ కార్యాలయంలో మేయర్‌కు హార్దిక జన్మదిన శుభాకాంక్షలను తెలిపి పుష్పగుచ్ఛాలను అందించి అభినందనలను తెలిపారు. అనంతరం విశాఖ నగర మేయర్ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ అందరికి కేకు పుట్టినరోజు కేకును కట్ చేసి ఆనందాన్ని పంచుకొని అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

21న పోలి పాడ్యమి

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి వరాహ పుష్కరిణిలో (కొండ క్రింద) ఈనెల 21న పోలి పాడ్యమి వేడుక జరుగుననది. ఇందుకు సంబంధించి

నగర దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ , ఇంచార్జ్ కార్యనిర్వహణాధికారి సుజాత సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్తీక మాసం చివరి రోజు పుష్కరిణిలో మహిళా భక్తులు దీపాలు వెలిగించి వదలటం అనే పోలిని స్వర్గానికి పంపించటం జరుగుతుంది. ఆరోజు వేకువ ఝాముమున పుష్కరిణి వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టు దిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయమని నగర పోలీస్ కమిషనర్ కు సమాచారం అందిస్తున్నట్లు ఇంచార్జ్ కార్యనిర్వహణాధికారి తెలిపారు. అదేవిధంగా పుష్కరిణి వద్ద పోలి పాడ్యమి కావలసిన ఏర్పాట్లు చేయమని దేవస్థానం ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులకు సిబ్బందికి ఆదేశాలు ఆమె జారీ చేశారు.

మేయర్‌కు జన్మదినోత్సవ శుభాకాంక్షలు

విశాలాంధ్ర-సింహాచలం: గ్రేటర్ విశాఖ విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కర రావు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లపు సురేష్, మనోహర్ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

21న జిల్లాలో పిటిషన్ల కమిటీ పర్యటన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పిటిషన్లపై శాసన సభ కమిటీ సమావేశం ఈ నెల 21వ తేదీ శుక్రవారం ఉదయం 11.00 గంటలకు విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించబడుతుందని శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో చిత్తూరు శాసన సభ్యులు గురజాల జగన్ మోహన్ కమిటీకి సమర్పించిన "సమగ్ర భూసర్వే పిటిషన్"పై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు.

మార్గశిర మహోత్సవ ఏర్పాట్లు

పటిష్టంగా చేయండి

సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - వన్ టౌన్: శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్గశిర మహోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలపై సమన్వయ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. కోఆర్డినేషన్ కమిటీ సమీక్ష సమావేశం సోమవారం సాయంత్రం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో కలక్టరు సమక్షంలో దేవస్థానం సన్నిధిలో జరిగింది. వివిధ ప్రభుత్వ శాఖలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ప్రారంభంలో, దేవస్థానం, వివిధ శాఖల అధికారులు భక్తుల సౌలభ్యం భద్రత కోసం మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. జరిగిన సమన్వయ కమిటీ సమీక్షా సమావేశంలో చర్చించిన తర్వాత నవంబర్ 20 మరో సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. సమన్వయ కమిటీ సమీక్షా సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి, దేవస్థానం అధికారులు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్), అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్), స్టేషన్ హౌస్ ఆఫీసర్ (వన్ టౌన్ పోలీస్ స్టేషన్), సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎపి ఈపీ డీసీ ఎల్), రీజినల్ మేనేజర్ (ఏపీ ఎస్ ఆర్టీసీ), గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, (నీటి సరఫరా), డివిజనల్ ఫైర్ ఆఫీసర్ (అగ్నిమాపక శాఖ), సూపరింటెండెంట్ (ఎక్సైజ్ శాఖ), అసిస్టెంట్ కమిషనర్ (ఎండోమెంట్ శాఖ, విశాఖపట్నం) అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు శ్రద్ధ చూపాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పీజీఆర్ఎస్ వేదికగా ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. వచ్చిన దరఖాస్తుకు మొక్కుబడిగా సమాధానం ఇచ్చి సరిపెట్టకుండా, సమస్య స్థితిగతులను తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదుదారుడికీ తగిన విధంగా ఎండార్స్మెంట్ ఇవ్వాలని, సంబంధిత విభాగాధిపతి నేరుగా ఫోన్ చేసి మాట్లాడాలని చెప్పారు. సర్వే సమయంలో రెవెన్యూ అధికారులు కూడా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని, తదుపరి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో ప్రక్షాళన అవసరమని లేదంటే ప్రజల నుంచి పెద్దయెత్తున ఫిర్యాదులు వస్తూనే ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ తో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ఎప్పటికప్పుడు ఫిర్యాదులను పరిష్కరించాలని, ఉద్దేశపూర్వక కాలయాపన, నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ సమస్యలపై 382 వినతులు అందాయి . ప్రజలు 382 వినతులు సమర్పించారు.

యువతిని బలి తీసుకున్న కిడ్నీ రాకెట్

దోషులందరికీ కఠిన శిక్షలు విధించాలి: ఐద్వా డిమాండ్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం వెలంకి పంచాయతీ బొడ్డపల్లి గ్రామానికి చెందిన యమున అనే యువతి ప్రాణాలు తీసిన కిడ్నీ రాకెట్ కేసులో పాలుపంచుకున్న దోషులందరినీ వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా విశాఖ జిల్లా ఐద్వా కమిటీ డిమాండ్ చేసింది. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కూడా కోరింది. సోమవారం యమున తల్లి సూరమ్మ, తమ్ముడు నాగేంద్ర, మరదలు సరితలను ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్ మాధవి, వై. సత్యవతి, భీమిలి ఐద్వా కార్యదర్శి కే. నాగరాణి కలిసి పరామర్శించారు. అనంతరం వారు జరిగిన ఘటన వివరాలు తెలుసుకున్నారు.
ఎనిమిదేళ్ల క్రితం భర్తను కోల్పోయిన యమున పది సంవత్సరాల బిడ్డతో తల్లిదండ్రుల వద్ద ఉంటూ ఒక ప్రముఖ దినపత్రికలో ఏజెంట్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తుండేది. ఈ క్రమంలో గాజువాకకు చెందిన సూరి, సత్య, పద్మ అనే వ్యక్తులు స్నేహితుల పేరుతో ఆమెతో పరిచయం పెంచుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. కొన్నేళ్లుగా ఆమెను నమ్మించి కలిసిమెలిసి తిరిగిన వీరు ఇటీవల అరకు పిక్నిక్‌కు వెళ్తున్నామని చెప్పి యమునను తీసుకెళ్లి, మదనపల్లిలో ఆమెను శవంగా మార్చారని వెల్లడించారు. విచారణలో యమునపై కిడ్నీ తొలగింపు ఆపరేషన్ నిర్వహించబడిందని, ఆపరేషన్ లోపాలు, సమస్యల వలన ఆమె మృతిచెందినట్లు పోలీసులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, ఇప్పుడు వరకు డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు, బాలరంగడు, మెహర్ రాజ్, ఆపరేషన్ చేసిన వైద్యుడు, అలాగే సూరి, సత్య, పద్మలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నప్పటికీ, సంఘటనకు కారణమైన కీలక వ్యక్తులు ఇంకా అరెస్టు కాలేదని ఈ సందర్భంగా తెలిపారు.

మెడికవర్ ఉమెన్, చైల్డ్ హాస్పిటల్స్‌లో ఘనంగా ప్రీమెచ్యూరిటీ డే

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ దినోత్సవం సందర్భంగా మెడికవర్ వుమన్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం బీచ్ రోడ్ లో 2 కే వాక్ థాన్ లో ప్లకార్డులతో అవగాహన కార్యక్రమం జరిపారు. సాయంత్రం కూడా చిల్డ్రన్స్ ఏరినా లో నియోనాటాలజిస్ట్ డాక్టర్ సాయి సునీల్ కిషోర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సుమారుగా 15 మిలియన్ల పిల్లలు నెలలు నిండకుండానే పుడుతున్నారన్నారు. నెలలు నిండకుండా అంటే 23 నుంచి 37 వారాల మధ్య పుట్టే పిల్లలందరినీ ప్రి మెచ్యూర్ బేబీస్‌గానే పరిగణించాలని, అయితే 37 వారాలకంటే ముందు పుట్టే పిల్లలు 'ప్రి మెచ్యూర్ 'కోవలోకి వస్తే, 28 వారాల లోపే పుట్టే పిల్లలు 'ఎక్స్ట్రీమ్ ప్రి మెచ్యూర్' కోవకు చెందుతారన్నారు. వీళ్లలో అందరూ పుడుతూనే ఆరోగ్య సమస్యలు వెంట తెచ్చుకోవడంతోపాటు ఎదిగేక్రమంలో కూడా ఎన్నో రకాల సమస్యలకు లోనవుతారని, మరీ ముఖ్యంగా తల్లి గర్భం నుంచి అత్యంత తక్కువ సమయంలోపే బయటపడే ఎక్స్ట్రీమ్ ప్రీ మెచ్యూర్ పిల్లలకు సమస్యలు ఒకింత ఎక్కువే అన్నారు. ఈ పిల్లలు నేరుగా తల్లుల ఫీడ్‌ను తీసుకోవడానికి అభివృద్ధి చేసే వరకు, వారికి ఎన్ఐసీయూ లోని ఫీడింగ్ ట్యూబ్ ద్వారా ఎక్స్‌ప్రెస్ట్ బ్రెస్ట్ మిల్క్ తాగిస్తారు. నెలలు నిండకుండా పిల్లలు పుట్టే అవకాశం ఉన్న గర్భిణులు ఎంతో ముందుగానే సకల సదుపాయాలూ ఉన్న ఆస్పత్రికి చేరుకోవాలి. ఆ ఆస్పత్రిలో ప్రసవం జరిగిన వెంటనే పిల్లలకు అందించవలసిన వైద్య సౌకర్యాలు అన్నీ అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. నెలలు నిండకుండా పుట్టే పిల్లల షుగర్ లెవెల్స్ క్రమంలో పెట్టాలి. లేదంటే, నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు నాలుగు రోజుల్లోనే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అలా జరగకుండా పిల్లలను ఇంక్యుబేటర్‌లో ఉంచి, వెంటిలేటర్ సహాయంతో వైద్యం అందించగలగాలి. ఇటువంటి పిల్లలకు సరైన చికిత్స అందించగలిగితే మనం వారిని కాపాడుకోగలం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గరుడ రామ, డాక్టర్ విద్యరమ, డాక్టర్ గీతవందన, డాక్టర్ రాధిక, డాక్టర్ లక్ష్మణ్ , డాక్టర్ విజయ్, డాక్టర్ మౌనిక, డాక్టర్ .స్రవంతి, డాక్టర్ ప్రియాంకా మరియు సెంటర్ హెడ్ డాక్టర్ శ్రీకాంత్ లతో పాటూ 200 కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లలను ఎంతోగానో ఆకట్టుకున్నాయి.

దీపోత్సవానికి సిద్ధమైన

అనంత పద్మనాభ స్వామి ఆలయం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలో భారతదేశంలోనే రెండవ అనంత పద్మనాభ స్వామి ఆలయం సుమారు 600 సంవత్సరాల క్రితం నిర్మితమైన శ్రీ అనంత పద్మనాభ స్వామి వారి దేవాలయం లో కార్తీక మాసం ఆఖరి న ఈనెల 19వ తారీఖున అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం ను దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. దీనికోసం ముందుగానే స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్ని శాఖల వారితో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఏ లోటుపాట్లు లేకుండా ఇప్పటివరకు జరిగిన దీపోత్సవాలు కంటే మరింత గొప్పగా దీపోత్సవాన్ని జరపాలని తెలియజేశారు. అధికారులు దీపోత్సవానికి కావలసిన అన్ని ఏర్పాట్లను ఒక్కొక్కటిగా పూర్తి చేసుకొస్తున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ విషయంలో పోలీసు వారు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. సింహాచలం నుండి వచ్చే వాహనాలను మద్ది కాటా దగ్గర నుంచి మద్ది బ్రిడ్జి వరకు నిలుపుదల చేయనున్నారు. తగరపువలస నుంచి వచ్చే వాహనాలను వెంగమాంబ క్వారీ దగ్గర నుంచి స్ప్రింగ్ ఫీల్డ్ స్కూల్, సొసైటీ క్వారీ వరకు వాహనాలను నిలుపుదల చేయనున్నారు. విజయనగరం నుండి వచ్చే వాహనాలను రెడ్డిపల్లి లేఔట్ జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ వరకు నిలుపుదల చేయనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ డిపార్ట్మెంట్ వారు మరిన్ని ఎక్కువ బస్సులు నడపనున్నట్లు తెలియజేశారు. వైద్యశాఖ వారు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయునునట్లు తెలియజేశారు. విద్యుత్ శాఖ వారు ఆలయానికి అలంకరణ కొండపై వరకు విద్యుత్ అలంకరణ ఇతర అవసరాల కొరకు విద్యుత్ సరఫరా కు ఎటువంటి అంతరాయం లేకుండా ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. రెవెన్యూ వారు, మండల అభివృద్ధి శాఖ వారు, భక్తులకు ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ సంవత్సరం కొండపై ఉన్న ఆలయాన్ని దర్శించుకోవడానికి మెట్ల మార్గమే కాకుండా ఘాట్ రోడ్డు కూడా అందుబాటులోకి రావడంతో భక్తులు మరింత సులభతరంగా కొండపైకి వెళ్ళటానికి అవకాశం ఉన్నందున మరింత భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్లో ప్రతి మలుపు వద్ద అత్యంత సుందరంగా చిత్రాలను గీసి భక్తులను పర్యాటకలను కనువిందు చేసే విధంగా ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దేవాదాయ శాఖ వారు కొండ దిగు భాగం ఉన్న కుంతి మాధవస్వామి ఆలయం దగ్గర నుంచి నారాయణేశ్వర స్వామి ఆలయం, కొండపై ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయం లో పూజా కార్యక్రమాలు కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆధ్యాత్మిక%శీ%గా ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఉదయం నుండే భక్తులు తాకిడి ఉన్నందున కావలసిన, సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు అన్ని శాఖల అధికారులు తెలియజేశారు. కొండమెట్లకు ఇరువైపులా దీపాలు వెలిగించేటప్పుడు మహిళలు జాగ్రత్త వహించాలని, ఎక్కడికి అక్కడ మంచినీళ్లు సౌకర్యం ఉన్నందున భక్తులకు అవసరమైతే వినియోగించుకోవాలని తెలియజేశారు. మెట్ల మార్గం గుండా ఎక్కేటప్పుడు జాగ్రత్త వహించి పైకి ఎక్కాలని తెలియజేశారు. రోడ్డు మార్గం గుండా వచ్చే భక్తులు కొండపై ఉన్న దేవాలయాన్ని చేరుకోవాలంటే సుమారు 60 మెట్లు ఎక్కాలని మెట్లకి ఇరువైపులా రైలింగ్ ఏర్పాటు చేసి ఉన్నారని ఎటువంటి ఇబ్బంది పడకుండా భక్తులు ఎక్కవచ్చునని తెలియజేశారు. దాతల సహాయ సహకారాలతో రైలింగ్, సోలార్ లైట్స్, సిమెంట్ బెంచ్ లు,వాటర్ ప్యూరిఫైయర్ తదితరమైన వి ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.